చిరకాల స్వప్నం.. సాకారం..

- రాకపోకలకు సిద్ధమవుతున్న కొత్త కాజ్‌వే
- ఇప్పటికే రూ.2 కోట్లతో దాదాపుగా నిర్మాణం పూర్తి
- రూ.కోటి అదనపు గ్రాంటుతో అప్రోచ్ పనులు

సఖినేటిపల్లి: గత ప్రభుత్వ హయాంలో లక్ష్యసాధనలో పాలకుల దక్షతకు టేకిశెట్టిపాలెం, అప్పనరామునిలంక గ్రామాల మధ్య గోదావరి పాయపై నిర్మించిన కొత్త కాజ్ వే నిలువుటద్దంగా నిలిచింది. ఎంతో కాలంగా ఇక్కడి పూర్వం నాటి కాజ్‌వే స్థానే కొత్త కాజ్‌వే నిర్మాణానికి రెండు గ్రామాల ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల వారు ఎదురుచూస్తూ వచ్చారు. ఈ తరుణంలో రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఇక్కడి కాజ్‌వే ఆవశ్యకతపై ప్రజా ప్రతినిధులు నాటి ప్రభుత్వం దృష్టికి పలు దఫాలుగా తీసుకువెళ్లారు. ఆ క్రమంలో చిరకాల స్వప్నం సాకారమయ్యే దిశగా పడిన అడుగులకు ప్రస్తుత తరుణంలో వారి ఆశలు పూర్తిగా నెరవేరే తరుణం ఆసన్నమైంది.

కాజ్‌వేను పరిశీలించిన నాటి కలెక్టర్

టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద నుంచి అప్పనరామునిలంక గ్రామానికి వెళ్లే మార్గంలో గోదావరి పాయపై రూ.2 కోట్లతో రూపుదిద్దుకున్న కాజ్ వేను నాటి కలెక్టర్ హిమాన్షుశుక్లా అప్పట్లో పరిశీలించారు. అంతర్వేది లక్ష్మీనరసింహుని సన్నిధికి వచ్చిన ఆయన తిరుగు ప్రయాణంలో కాజ్‌వేను సందర్శించారు. కాజ్‌వేకు రెండు వైపులా అప్రోచ్ రోడ్లకు నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌కు, ఎంపీపీ వీరా మల్లిబాబు విజ్ఞప్తి చేశారు.

రూ.2 కోట్లతో కాజ్‌వే పూర్తి

ఎత్తు తక్కువలో ఉండి, శిథిల స్థితికి చేరుకున్న ఈ కాజ్‌వే స్థానే కొత్త కాజ్ వే నిర్మాణం ఆర్‌అండ్‌బీలో గత ప్రభుత్వంలో మంజూరైన రూ.2 కోట్లతో అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. అయితే కాజ్ వేకు అటు అప్పనరామునిలంక, ఇటు టేకిశెట్టిపాలెం వైపులకు అప్రోచ్ రోడ్లు తదనంతరం మంజూరైన రూ.కోటితో ఇక పూర్తి కావాల్సి ఉంది. వేర్వేరు జిల్లాలకు చెందిన వారంతా చించినాడ వంతెన మీదుగా టూ వీలర్స్, ఫోర్ వీలర్స్‌పై ప్రయాణించి, ఇక్కడ కాజ్ వేను దాటుకుని, అంతర్వేది పుణ్యక్షేత్రానికి వెళ్లడం పరిపాటి.

వరదలు, ఆటుపోట్లతో అవాంతరం

ఏటా ఏటిగట్టు దిగువన వశిష్ఠ గోదావరి తీరం వెంబడి టేకిశెట్టిపాలెం కొంత భాగం, అప్పనరామునిలంక పూర్తిగాను వరద ముంపులో పూర్తిగా చిక్కుకుంటాయి. అలాగే గోదావరి ఆటు, పోట్లకు నీరు పోటెత్తి అప్రోచ్ మార్గాలను ముంచెత్తుతోంది. ఈ రీత్యా అప్రోచ్ రోడ్లు పనులకు తీవ్ర అంతరాయం ఏర్పడుతూ వస్తోంది.

చురుగ్గా అప్రోచ్ రోడ్డు పనులు

గోదావరికి వరదలు, ఆటుపోట్ల బెడద తప్పడంతో అనుకూల పరిస్థితుల్లో కాజ్‌వేకు రెండు వైపులా గోదావరి పాయను అనుకుని రూ.కోటితో అప్రోచ్ రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. దీంతో కొత్త కాజ్‌వే పై రెండు గ్రామాల ప్రజలతో పాటు, అంతర్వేది పుణ్యక్షేత్రానికి రాకపోకలు సాగించే భక్తులకు ఎంతో ఉపయోగకరంగా మారనుంది. ధవళేశ్వరం వద్ద మొదటి వరద ప్రమాద హెచ్చరికను దాటి రెండో వరద ప్రమాద హెచ్చరిక జారీ చేసే వరకూ కూడా కాజ్‌వే మీదుగా రాకపోకలకు అటు ప్రజలకు, ఇటు భక్తులకు ఆటంకం లేకుండా ఉండనుంది.


టేకిశెట్టిపాలెం-అప్పనరామునిలంక మధ్య గోదావరి పాయపై నిర్మించిన కొత్త కాజ్‌వే


టేకిశెట్టిపాలెం-అప్పనరామునిలంక మధ్య పూర్వపు కాజ్‌వే (ఫైల్)


అప్పనరామునిలంక వైపు పూర్తయిన అప్రోచ్ రోడ్డు

రూ.కోటితో అప్రోచ్ రోడ్లు

"కాజ్‌వేకు ఇరువైపులా అప్రోచ్ రోడ్ల నిమిత్తం గతంలో మంజూరైన రూ.కోటితో ప్రస్తుతం పనులు చురుగ్గా సాగుతున్నవి. అప్పనరామునిలంక వైపు ఇప్పటికే పూర్తి కావచ్చాయి. టేకిశెట్టిపాలెం వైపు అప్రోచ్ రోడ్డు పనులకు అవరోధం లేకుండా గోదావరి పాయకు క్రాస్ బండ్ వేశాం. కాజ్‌వేకు ఇరు వైపులా 60 మీటర్ల చొప్పున అప్రోచ్ రోడ్లు నిర్మిస్తున్నాం."
– సురేష్, ఆర్‌అండ్‌బీ, జేఈ, రాజోలు

మొదటి వరద ప్రమాద హెచ్చరికతో మునక

టేకిశెట్టిపాలెం వద్ద ఏటిగట్టు దిగువన అప్పనరామునిలంక గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో గోదావరి పాయపై సుమారు ఐదు దశాబ్దాల కిందట నిర్మించిన కాజ్‌వే (తూరల కల్వర్టు) పూర్తి శిథిల స్థితికి చేరింది. అప్పట్లో తొలుత కాజ్‌వేకు వేసిన మొదటి వరస తూరల ద్వారా నీటి ప్రవాహం మందగించడంతో తదనంతర కాలంలో వాటిపై మరో వరుస తూరలు వేశారు. అయితే కాలక్రమంలో రెండు వరుసల తూరలు నత్తగుల్లలతో మూసుకుపోవడంతో గోదావరిలోకి మురుగునీటి ప్రవాహం పూర్తిగా మందగించడంతో ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతూ వచ్చారు. దీనికి తోడు ధవళేశ్వరం వద్ద మొదటి వరద ప్రమాద హెచ్చరిక జారీతోనే కాజ్‌వే మునిగిపోవడం, రోజులు తరబడి కాజ్‌వే వరద నీటిలో ఉండడం, కాజ్‌వే మీదుగా పై రెండు గ్రామాల ప్రజలతో పాటు, అంతర్వేది పుణ్యక్షేత్రానికి రాకపోకలకు సాగించే ఇతర జిల్లాల భక్తులు కూడా ఇబ్బందులు పడుతూ వచ్చేవారు. ఏటా క్రమం తప్పకుండా వస్తున్న వరదలకు తగ్గట్టుగా, ముంపు నీరు త్వరితగతిన గోదావరిలోకి దిగేందుకు వీలుగాను కొత్త కల్వర్టు కోసం ఎన్నో ఏళ్లుగా ప్రజలు, రైతులు ఎదురు చూస్తూ వచ్చారు.

క్లుప్తంగా

వైభవంగా శ్రీరామ సప్తాహం


సప్తాహంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

ఆలమూరు: మండలంలోని పినపళ్లలోని మెరక వీధి రామాలయం వద్ద నిర్వహిస్తున్న శ్రీరామ సప్తాహ మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఆరో రోజైన సోమవారం నాడు గ్రామానికి చెందిన కొత్తూరి సాయి రామకృష్ణ దంపతులు భక్తుల జన సందోహం మధ్య ఊరేగింపుగా వెళ్లి ఆలయ ముఖ మండపంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పూజలు నిర్వహించారు. తొలుత బాజాభజంత్రీలతో మేళ తాళాలు, బాణసంచా పేలుళ్లతో దేవతామూర్తులను పల్లకీలో ఉంచి నిర్వహించిన గ్రామోత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈనెల 19న ప్రారంభమై ఈ సప్తాహం మంగళవారంతో ముగియనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. సర్పంచ్ సంగిత సుభాష్, ఎంపీటీసీ పెదిరెడ్డి పట్టాభి, ఏఎంసీ మాజీ చైర్మన్ వక్కపట్ల లక్ష్మణరావు, సంగిత పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరన్నబాబు సంబరం


పూజలు చేస్తున్న కోఆర్డినేటర్ గన్నవరపు

పి.గన్నవరం: మండలంలోని యర్రంశెట్టివారిపాలెం గ్రామంలో వేంచేసిన భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి వారి ఆలయంలో సోమవారం కొప్పులవారి వీరన్నబాబు బోణాల పండగను ఘనంగా నిర్వహించారు. జంగమ దేవర వీరకుమారులతో గ్రామోత్సవం జరిగింది. ఈసందర్భంగా బాణసంచా కాల్పులతో, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం వీరభద్రస్వామి ఆలయంలో జమ్మిచెట్టు వద్ద పూజలు నిర్వహించారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్న సమారాధన చేశారు. రాత్రి స్వామి వారి కళ్యాణ మహోత్సవం జరిగింది. కొప్పుల వారి కుటుంబాల వారు పాల్గొన్నారు. ఈసందర్భంగా స్వామి వారిని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితుడికి సాయం


బాధితుడికి సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో చేయి, కాలు పడిపోయిన బాధితుడి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు సోమవారం రూ.10 వేల చెక్కును సాయంగా అందజేశారు. రావులపాలెం గ్రామానికి చెందిన కొడమంచిలి ప్రకాశం (50) బైక్ మెకానిక్‌గా పని చేసేవాడు. పదేళ్ల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి చేయి, కాలు పడిపోయి ఏ పని చేయలేక ఇంటి దగ్గరే ఉంటున్నారు. ఇతని కొడుకు ఇటీవల మృతి చెందాడు. భార్య ఒక షాప్‌లో పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటుంది. ప్రకాశానికి వైద్యం చేయించడానికి కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరడంతో సభ్యులు ప్రకాశం ఇంటికి వెళ్లి రూ.10 వేల చెక్కును ఆర్థికసాయంగా అందజేశారు.

500 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం


పేరవరం లంకలో బెల్లపు ఊట పీపాలతో అన్నవరం

కొత్తపేట: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో గురువారం 500 లీటర్ల బెల్లపుఊటను కనుగొని ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని తెలిపారు. ఎస్సై కె.అన్నవరం ఆధ్వర్యంలో ఆత్రేయపురం మండలం పేరవరం సమీప లంకలో సారా తయారీకి ఉపయోగించే బెల్లపుఊట నిల్వ ఉంచిన ప్లాస్టిక్ పీపాలను గుర్తించారు. వాటిని వెలికి తీసి, వాటి లో ఊటను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ పట్ల అప్రమత్తంగా ఉండాలి

అంబాజీపేట: క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉంటూ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హెచ్‌ఎం కడలి సాయిరామ్, పీహెచ్‌సీ వైద్యాధికారి కేఎస్.శ్రీనివాస్ అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా సీహెచ్‌ఓ బి.అప్పారావు అధ్యక్షతన అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. అంతకుముందు అంబాజీపేట పీహెచ్‌సీ వద్ద వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ టీబీ లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలన్నారు.

అన్నదానానికి విరాళం


దాతకు స్వామి చిత్రపటం అందిస్తున్న ఉద్యోగులు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదానం ట్రస్టుకు పి.గన్నవరం మండలం మానేపల్లికి చెందిన ఉండవల్లి రాఘవేంద్రరావు, సరస్వతి దంపతులు సోమవారం రూ.11,116 విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సత్యమూర్తికి అందజేశారు. అర్చకులు గొడవర్తి శ్రీనివాస్, గొడవర్తి జగదీష్ స్వామి వారి ఆశీర్వచనం అందించారు. వారికి స్వామి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

అయినవిల్లిలో..


దాత నాగబాబు, రాణి దంపతులకు స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి చిత్రాడ గ్రామానికి చెందిన యాగ నాగబాబు, రాణి దంపతులు సోమవారం రూ.10,116 విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకుడు సత్తిబాబుకు అందజేశారు. దాతను ఆలయ అర్చకులు, వేదపండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది. గ్రామస్తులు అభినందించారు.

బుల్లబ్బాయి సేవలు అభినందనీయం

సఖినేటిపల్లి: మోరి గ్రామానికి చెందిన ఎన్నారై, ఖతార్ దేశంలోని టీసీఎఫ్ సంఘకాపరి, బిషప్ ఓగూరి బుల్లబ్బాయి, గ్రామంలోను, ఆ దేశంలోనూ నిర్వహిస్తున్న సేవలు అభినందనీయమని స్థానిక మహిమ కోకోనట్ ప్రొడ్యూసర్స్ కంపెనీ చైర్మన్ ఓగూరి టాండన్‌రాజు అన్నారు. సోమవారం మోరి మహిమ సీపీసీ కార్యాలయంలో ఆయన చేస్తున్న సేవలకు కృతజ్ఞతగా స్థానికులు ఘనంగా సత్కరించారు. అనంతరం టాండన్‌రాజు మాట్లాడుతూ, స్థానికంగా పేదలను ఆదుకోవడంలో బిషప్ బుల్లబ్బాయి చొరవ చూపడంతో పాటు, ఖతార్‌లో మృత్యువాత పడుతున్న వారిని సొంత ఖర్చులతో భారతదేశానికి పంపిస్తూ, మృతుల కుటుంబాలకు రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకూ ఆర్థికసాయాన్ని బుల్లబ్బాయి పంపిణీ చేస్తున్నట్టు టాండన్ రాజు అన్నారు. పాస్టర్ ఓగూరి చిట్టిబాబు, సీహెచ్ ప్రభుదాస్, ఓ.కృపాసరోజిని, మరియమ్మ, ధనలక్ష్మి, విప్పర్తి శామ్యూల్‌రాజ్, కొల్లాబత్తుల బెంజమిన్ సంజన పాల్గొన్నారు.


మోరి మహిమ సీపీసీ కార్యాలయంలో బుల్లబ్బాయిని సత్కరిస్తున్న టాండన్‌రాజు

తల్లిదండ్రులకు పాదపూజ

మామిడికుదురు: మొగలికుదురు శ్రీచైతన్య స్కూల్లో విద్యార్థులు సోమవారం తల్లిదండ్రులకు పాదపూజ చేశారు. విద్యార్థులకు విద్యతో పాటు సమగ్ర సర్వతోముఖాభివృద్ధికి కృషి చేసే లక్ష్యంతో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని రాజోలు బ్రాంచ్ ఏజీఎం పార్థసారథి తెలిపారు. మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ అన్న ఆర్యోక్తికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామన్నారు. దీనిలో భాగంగా విద్యార్థులు వారి తల్లిదండ్రులకు పాదపూజ చేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజ్‌కుమార్, కోఆర్డినేటర్ శ్రీకాంత్, ప్రిన్సిపాల్ సుధాలక్ష్మి ఎకడమిక్ డీన్ రమేష్ పాల్గొన్నారు.


తల్లిదండ్రులను సత్కరిస్తున్న విద్యార్థులు

తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన

అయినవిల్లి: మండలంలోని ఎస్.మూలపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో డివిజనల్ పంచాయతీ అధికారి పి.బొజ్జిరాజు ప్రజలకు సోమవారం అవగాహన కల్పించారు. సర్పంచ్ బొబ్బా ప్రభాత్‌కుమార్ అధ్యక్షతన బొజ్జిరాజు తడి, పొడి చెత్త సేకరణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. చెత్తను సేంద్రియ ఎరువుగా మార్చి పంటలకు వేయడం ద్వారా అదనపు ఆదాయం సమకూర్చుకోవచ్చన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను, పొడి చెత్తను తగలబెట్టడం ద్వారా గ్రామంలో పరిసరాలు శుభ్రంగా ఉంటాయన్నారు. దోమలు వృద్ధి చెందవన్నారు. అంటూ రోగాలు ప్రబలకుండా కాపాడుకోవచ్చన్నారు. ఆయన వెంట ఈవోపీఆర్డీ వాణిశ్రీ బెహర, వివిధ గ్రామ పంచాయతీల కార్యదర్శులు తదితరులు ఉన్నారు.


చెత్త సేకరణపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న డీఎల్పీవో బొజ్జిరాజు

పెద్దింట్లమ్మ ఉత్సవాలకు పందిరి రాట

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెం శివారు మెండుపాలెంలో కొలువైన పెద్దింట్లమ్మ అమ్మవారి ఆలయంలో ఈ నెల 28 నుంచి వచ్చే నెల 28వ తేదీ వరకూ ఉత్సవాలను ఎండోమెంట్స్ ఆధ్వర్యంలో అంతర్వేది దేవస్థానం, పోలీసు, రెవెన్యూ సహకారంతో నిర్వహించనున్నారు. అమలాపురం ఆర్డీవో కె.మాధవి ఆదేశాలపై సోమవారం అమ్మవారి ఆలయాన్ని దేవస్థానం ఇన్‌స్పెక్టర్ జె.రామలింగేశ్వరరావు, అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది సందర్శించారు. అమ్మవారి ఉత్సవాల నిర్వహణకు ఆలయ పరిధిలోని రెండు వర్గాలు మధ్య విభేదాలు ఉండడంతో ముందస్తు జాగ్రత్తలపై పైస్థాయి అధికారులు ఈ చర్యలకు ఆదేశాలిచ్చారు. ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో నిర్వహించే ఉత్సవాలకు ఇరువర్గాలు సహకరించాలని సీఐ సూచించారు. దేవాలయంలోని 4 మెయిన్ హుండీలకు, స్థానిక సత్తెమ్మ అమ్మవారి ఆలయ ఒక హుండీకి అధికారులు తాళాలు వేసి, సీలు వేశారు. అలాగే ఆరు గదుల సముదాయంతో ఉన్న అమ్మవారి ప్రధాన ఆలయాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ పర్యవేక్షణలో అంతర్వేది దేవస్థానం ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, వేదపండితుడు చింతా వేంకటశాస్త్రి, పెద్దింట్లమ్మ గుడి ఆసాదులతో పందిరి రాట ముహూర్తం ఉదయం 11.46 గంటలకు నిర్వహించారు. పందిరి రాటను పాతి ఉత్సవాలకు నాంది పలికారు. ఇదిలా ఉండగా పెద్దింట్లమ్మ అమ్మవారి ఉత్సవాలకు వచ్చే చీరలు, జాకెట్లు అమ్ముకునే హక్కులకు, ఇతర అంశాలకు సంబంధించి టెండర్లు నిర్వహిస్తున్నట్టు ఏసీ తెలిపారు.


కేశవదాసుపాలెం పెద్దింట్లమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాలకు పందిరి రాట వేస్తున్న అర్చకులు

'జ్ఞానజ్యోతి'పై అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ

పి.గన్నవరం: మండలంలో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం జ్ఞానజ్యోతి కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. ఉప విద్యాశాఖాధికారి పి.రామలక్ష్మణ మూర్తి జ్ఞానజ్యోతి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓలు కోన హెలీనా, చింతా వీరభద్రానందం, హెచ్‌ఎం డీఎస్‌వీ ప్రసాద్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రావులపాలెం/కొత్తపేట: పునాది అభ్యసనతోనే పూర్వ ప్రాథమిక విద్య, ప్రాథమిక విద్య బలోపేతం అవుతుందని సమగ్ర శిక్ష అకాడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు అన్నారు. రావులపాలెం ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న జ్ఞాన జ్యోతి ట్రెనింగ్ ప్రోగ్రామ్ను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏఎమ్ఓ రాంబాబు మాట్లాడుతూ మూడు నుంచి ఎనిమిది సంవత్సరాల వయసు ఉన్న చిన్నారుల్లో మెదడు అభివృద్ధి 85% ఉంటుందన్నారు. ఆ వయసులోనే విద్యార్థులకు భాష గణిత భావనలపై పట్టు సాధించే విధంగా బోధన సాగించాలన్నారు. విద్యార్థిని ఆకట్టుకునే విధంగా తరగతి గదిని తయారు చేసుకోవాలని, విద్యార్థుల తల్లిదండ్రులతో నిరంతరం విద్యార్థుల ప్రగతిని చర్చించాలన్నారు. క్షేత్రస్థాయిలో స్కూల్ రెడీనెస్ మేళ ఘనంగా నిర్వహించాలన్నారు. అలాగే కొత్తపేటలోనూ అంగన్‌వాడీలకు జ్ఞానజ్యోతిపై అంగన్‌వాడీలకు అవగాహన కల్పించారు.


అంగన్‌వాడీలకు నిర్వహించిన శిక్షణలో పాల్గొన్న ఎంఈఓ హెలీనా

స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌కు శ్రీవల్లి ఎంపిక


సుంకర శ్రీవల్లి

సఖినేటిపల్లి: మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థిని సుంకర శ్రీవల్లి రూపొందించిన జీడిపప్పు పొట్టుతో సహజ ఎరువు తయారీ ప్రాజెక్ట్ జాతీయ స్థాయికి ఎంపికైనట్టు పాఠశాల హెచ్‌ఎం ఎస్.శ్రీధర్ కృష్ణ సోమవారం చెప్పారు. గత డిసెంబర్‌లో జరిగిన స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ 2024 ఆన్‌లైన్ సైన్సు ప్రాజెక్ట్ పోటీల్లో భాగంగా వ్యర్థాల నిర్వహణ అంశంలో శ్రీవల్లి పై ప్రాజెక్ట్ రూపకల్పన చేసినట్టు శ్రీధర్‌కృష్ణ అన్నారు. జిల్లా నుంచి జాతీయ స్థాయికి ఎంపికైన రెండు ప్రాజెక్టులలో మోరి పాఠశాలకు చెందిన పై ప్రాజెక్ట్ ఒకటి అని ఆయన అన్నారు. కాగా శ్రీవల్లికి పలువురు అభినందనలు చెప్పారు.

ప్రతాప్ సాహితీ ప్రస్థానంపై సాంగ్ విడుదల

సఖినేటిపల్లి: శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సాహితీ ప్రస్థానంపై రూపకల్పన చేసిన సాంగ్ ఆడియో సీడీను ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్‌రాజ్ ఇంజినీరింగ్ కాలేజీలో ప్రముఖులు ఆవిష్కరించారు. వివరాలు సోమవారం ఆయన వీవీమెరకలో మీడియాకు తెలిపారు. శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో కాలేజీలో 144వ శతాధిక కవిసమ్మేళనం, సాహిత్య సదస్సు నిర్వహించారు. ఇందులో చర్ల మండలంకు చెందిన జర్నలిస్ట్ చర్ల లక్ష్మణ్, అగణిత గుణ ఘనుడు-కత్తిమండ ప్రతాపుడు అంటూ రాసిన పై గీతాన్ని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, కళాబంధు తాళ్లూరి పంచాక్షరయ్యలు ఆవిష్కరించారు.

ఉద్యాన పంటలపై అవగాహన

అయినవిల్లి: ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉద్యాన పంటలపై అవగాహన కల్పించారు. అయినవిల్లిలంకలో ఓ రైతు పంట భూమిలో క్షేత్ర పర్యటన చేశారు. కోకో, ఇతర ఉద్యాన పంటల సాగుపై వ్యవసాయక్షేత్రాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిమ్మకాయల గణేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులు సందర్శించారు. అనంతరం వివిధ ఉద్యాన పంటలు పండించే విధానాన్ని ఆయన వివరించారు. కొబ్బరిలో అంతరపంటగా కోకో పంట సాగు చేయడం వల్ల వచ్చే లాభాన్ని వివరించారు. అలాగే కోకో పంట నుంచి వచ్చే వ్యర్థాలను కొబ్బరి పంటకు ఎరువుగా ఉపయోగపడుతుందన్నారు. అలాగే సాగునీరు వృథా కాకుండా ఉపయోగించుకోవచ్చన్నారు. అంతర పంటలుగా కొబ్బరిలో కోకోతో పాటు, కూరగాయలు, అరటి, మొక్కజొన్న, చెరకు వంటి పంటలను పండించవచ్చన్నారు. కార్యక్రమంలోఅగ్రికల్చర్ ట్రైనీ కుమారి వై.కమలప్రియ, బీబీవీ కుమారి, కె.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



అయినవిల్లిలంకలో ఓ రైతు వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

రోగులకు రక్తదానం


అమలాపురం ఏరియా ఆస్పత్రిలో రక్తదానం చేస్తున్న యువకులు

పి.గన్నవరం: కుందాలపల్లి శివారు పప్పులవారిపాలెంలోని స్వామి వివేకానంద యోగాశ్రమం ఆధ్వర్యంలో సోమవారం 23 మంది రక్తదానం చేసినట్టు యోగా గురువు శ్రీనివాస్ తెలిపారు. అమలాపురం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగుల కోసం అక్కడ రక్తదానం చేసినట్టు ఆయన వివరించారు. తాను స్థాపించిన ఎనిమిది యోగాశ్రమాల్లో శిక్షణ పొందుతున్న శిక్షకుల ద్వారా సుమారు 23 వేల మంది రోగులకు రక్తదానం చేసినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో పి.అనిల్, ఎం.కార్తిక్, బి.ధనుంజయ, సి.మాలిని, ఎస్.దుర్గేష్, బాబీ, సాయి, బాలు, ఆది, సూరిబాబు, శ్రీను, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్ మట్టి అమ్మకాలపై విచారణ చేపట్టాలి

రాజోలు: శంకరగుప్తం డ్రెయిన్ పూడికతీత మట్టి అమ్మకాలపై విచారణ చేపట్టాలని రాజోలు డ్రెయిన్‌శాఖ అధికారులకు సోమవారం విశ్వేశ్వరాయపురం, మోరి, మోరిపోడు గ్రామాలకు చెందిన పలువురు ఫిర్యాదు చేశారు. రూ.47 లక్షలతో పనులు చేపట్టి డ్రెయిన్ మట్టిని ప్రైవేటు వ్యక్తులకు విక్రయించారని అధికారులకు వివరించారు. డ్రెయిన్ పూడికతీత ద్వారా వచ్చిన మట్టిని మోరి, మోరిపోడు గ్రామాల్లోని శ్మశానవాటికలు మెరక చేస్తున్నట్టు నమ్మించి ఆ పనుల ముసుగులో సుమారు 200 ట్రాక్టర్ల మట్టిని ప్రైవేటు వ్యక్తులకు విక్రయించారన్నారు. పనులు చేపట్టిన మూడు రోజుల నుంచి యథేచ్ఛగా మట్టి విక్రయించారన్నారు. దీనిపై డ్రైన్స్ అధికారులకు ఫిర్యాదు చేయగా సదరు స్థలాలను ఫొటోలు తీసుకుని వెళ్లారని ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు సామాజిక కార్యకర్త యెనుముల వెంకట సుబ్రహ్మణ్యేశ్వరావు తెలిపారు.

సర్వీస్ లైన్ చార్జీలు తగ్గించాలి


సఖినేటిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న ఆక్వా రైతులు

సఖినేటిపల్లి: ఆక్వా చెరువులకు సర్వీస్ లైన్ చార్జీలను తక్షణం తగ్గించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆక్వా రైతులు ధర్నా చేశారు. సబ్‌స్టేషన్ అధికారులకు వారు వినతిపత్రం అందజేశారు. చెరువులకు సర్వీస్ లైన్ చార్జీలు వెంటనే చెల్లించమని ఆ శాఖ సీఎండీ నుంచి ఆదేశాలు వచ్చినట్టు, ఇప్పటికే నష్టాల్లో కూరుకుపోయి ఉన్న తమకు ఈ చార్జీలు మరింత భారమయినట్టు వారు ఆ పత్రంలో పేర్కొన్నారు. తామంతా చార్జీలు కట్టలేని స్థితిలో ఉన్నామని, తమ సమస్యను ఇప్పటికే ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లినట్టు, ఆక్వా రైతులపై సానుకూలంగా స్పందించి, సర్వీస్ లైన్ చార్జీలు రద్దు చేయాలని వారు అధికారులను కోరారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, ఆర్‌వైఎస్ రాజా, దొంగ నాగ సత్యనారాయణ తదితర ఆక్వా రైతులు పాల్గొన్నారు.